**ఉత్సాహంగా 2కే రన్**



2



2

**అత్యాచార నిందితుడి అరెస్ట్**



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in




కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకేట రవి ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశం కోసం ఇందిరాగాంధీ కుటుంబం ప్రాణత్యాగం చేసిందని గుర్తు చేశారు. **– అక్షరటుడే, కమ్మర్‌పల్లి**



## పేదల సొంతింటి కలను నెరవేస్తున్న ప్రభుత్వం: పోచారం



**అక్షరటుడే, బాన్సువాడ :** పేదల ఆత్మగౌరవ ప్రతీక అయిన సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల పథకం నెరవేరుస్తోందని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాన్సువాడ మండలం నాగారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం ప్రారంభించారు. గృహప్రవేశం చేసుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. పోచారం మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గంలో ఇళ్లు లేని, కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని తెలిపారు. అనంతరం బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో ఎల్లమ్మ కాలనీ డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఎస్సీ కాలనీలో రూ.70 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


## శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్‌కు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. అధికారులు 16 గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలోకి ప్రస్తుతం 59,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 16 వరద గేట్ల ద్వారా 50 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేలు, సరస్వతి కాలువకు 650, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా ఉంది.

### నిజాంసాగర్‌లోకి..

**ఎల్లారెడ్డి:** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 27,352 క్యూసెక్కుల వరద వస్తోంది. వరద గేట్ల ద్వారా అంతేమొత్తంలోన నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1405 (17.8 టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం అంతేమొత్తంలో నీరు నిల్వ ఉంది.

## ఇందల్వాయి తహశీల్దార్ కార్యాలయం తనిఖీ



**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహశీల్దార్, సిబ్బందితో భూ భారతి, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పూర్వ ప్రక్రియ అమలుపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంతమందికి నోటీసులు ఇచ్చారు.. క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా లేదా అనే వివరాలను తెలుసుకున్నారు. నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదాబైనామా, పీఓటీలకు సంబంధించిన అప్లికేషన్‌లను క్షుణ్ణంగా పరిశీలన జరపాలని, వెంటవెంటనే నోటీసులు జారీ చేస్తూ, క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్ వెంకట్ రావు తదితరులు ఉన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మంత్రివర్గ విస్తరణ చేపట్టింది. మాజీ క్రికెటర్ అజారుద్దీన్ కు కేబినెట్ బెర్తు కల్పించింది. అయితే, ఉమ్మడి జిల్లాకు కాంగ్రెస్ మూడోసారి రిక్త'హస్తమే' చూపింది. తాజాగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారంతో కలిపి ఇప్పటివరకూ మూడు సార్లు కేబినెట్ విస్తరణ జరిగినా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. కచ్చితంగా మంత్రి పదవి వస్తుందని భావించిన బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డికి మరోసారి నిరాశే మిగిలింది. అలాగే, ఉమ్మడి జిల్లాకు చెందిన మరో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి షబ్బీర్ అలీకి కూడా భంగపాటే ఎదురైంది. ఆయనకు కూడా ఈసారి అవకాశం దక్కకుండా పోయింది. మంత్రి పదవి రాలేదన్న తీవ్ర అసంతృప్తిలో ఉన్న బోధన్ ఎమ్మెల్యేను సంతృప్తి పరిచేందుకు కాంగ్రెస్ నాయకత్వం.. షబ్బీర్‌అలీ తరహాలోనే ఆయనను కూడా ప్రభుత్వ సలహాదారుగా నియమించింది.** —అక్షరటుడే, నిజామాబాద్

# మరోసారీ నిరాశే..





■ మంత్రివర్గ విస్తరణలో జిల్లాకు మొండి'చేయి' ■ ప్రభుత్వ సలహాదారుగా పీఎస్సార్ నియామకం ■ కేబినెట్ హోదా.. విశేష అధికారాలు
■ ఉమ్మడి జిల్లాకు ఇక అమాత్య యోగం లేనట్లేనా..! ■ మూడుకు చేరిన సలహాదారుల సంఖ్య

రాష్ట్ర కేబినెట్లో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరో ఒకరు ప్రాతినిధ్యం వహిస్తుండడం కొన్ని దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కూడా ఆ సంప్రదాయం కొనసాగింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాకు చెందిన నేతలెందరో మంత్రులుగా పని చేశారు. అర్గుల్ రాజారాం, మహిపాల్ రెడ్డి నుంచి మొదలుకుని సంతోష్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, డి.శ్రీనివాస్, వేముల ప్రశాంత్ రెడ్డి వరకూ వివిధ ప్రభుత్వాల్లో జిల్లా నుంచి అమాత్యులుగా ప్రాతినిధ్యం వహించారు. అయితే, దాదాపు పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాకు కేబినెట్‌లో చోటు లేకుండా పోయింది. తొలిసారి మంత్రివర్గ విస్తరణ జరిగిన సమయంలో రేవంత్ రెడ్డి సహా 12 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయగా, వారిలో జిల్లా నుంచి ఒక్కరికీ అవకాశం దక్కలేదు. ఇటీవల రెండోసారి విస్తరణ జరిగినప్పటికీ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు చాన్స్ రాలేదు. మూడోసారైనా అవకాశం లభిస్తుందనుకుంటే నిరాశే మిగిలింది.

### మంత్రుల్లేరు.. సలహాదారులే..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాపై కాంగ్రెస్ నాయకత్వం వివక్ష చూపుతున్నట్లే కనిపిస్తోంది. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో కలిపి కాంగ్రెస్ పార్టీకి నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు., బీఆర్ ఎస్ నుంచి గెలిచిన పోచారం శ్రీనివాసరెడ్డి తదనంతర పరిణామాల్లో హస్తం పార్టీ పంచన చేరారు. రాజకీయంగా ఎంతో కీలకమైన ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం.. సలహాదారులతో సరిపెడుతోంది. సీనియర్ నేత, మాజీ మంత్రి షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. ఆ తర్వాత కాంగ్రెస్ లో చేరిన పోచారం శ్రీనివాసరెడ్డికి సైతం ప్రభుత్వ సలహాదారుగా అవకాశం కల్పించింది. ఇక తాజాగా, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డిని కూడా సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ సలహాదారుల సంఖ్య మూడుకు చేరింది.

### మంత్రి కానీ మంత్రిగా..

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి వస్తుందని అంతా భావించారు. ఆయన కూడా ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ తొలి, మలి విడుత విస్తరణలో భంగపాటు తప్పలేదు. తాజాగా జరిగిన విస్తరణలో అయినా చాన్స్ వస్తుందని భావించగా, మరోసారి నిరాశే ఎదురైంది. 70 ఏండ్ల వయస్సు పైబడిన సుదర్శన్ రెడ్డి ఆది నుంచి కాంగ్రెస్ వాదిగా ఉన్నారు. గత పదేళ్లలో పార్టీ అనేక కష్టాల్లో ఉన్నప్పటికీ ఆయన మాత్రం పక్కచూపులు చూడలేదు. వయస్సు, సీనియారిటీ, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకున్నా పీఎస్సార్ కు అమాత్యుడిగా అవకాశం దక్కాల్సి ఉంది. కానీ రేవంత్ ప్రభుత్వం మొండి చేయి చూపింది. ఆయనను ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేబినెట్ హోదాతో పాటు విశేష అధికారాలు కల్పిస్తూ మంత్రి కాని మంత్రిని చేసింది.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి: సీపీ




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ప్రభుత్వ సర్వీసులో ఉన్న ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పదవీ విరమణ చేసిన సిబ్బందికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఐబీ సీఐ వెంకటయ్య పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా సీపీ ఆయనను ఘనంగా సత్కరించారు.అనంతరం సీపీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో ఎంతో పని ఒత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా పదవీ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పక ఉంటుందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా పోలీస్ శాఖ నుంచి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తిరుపతి ఆఫీస్ సూపరింటెండెంట్స్ శంకర్, బషీర్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ పాషా వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్‌ను సందర్శించిన జీఆర్ఎంబీ ఛైర్మన్




**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌ను గోదావరి నది యాజమాన్య బోర్డు ఛైర్మన్ పాండే శుక్రవారం సందర్శించారు. 'స్వచ్ఛత హీ సేవా', 'స్పెషల్ క్యాంపెయిన్ 5.0', 'అమ్మ పేరుతో ఒక చెట్టు' కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్ట్ పరిసరాల్లో పరిశుభ్రతా కార్యక్రమాలు, నీటి నిర్వహణ, నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపు, తదితర అంశాలపై ప్రాజెక్టు అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టు అధికారులు నిర్వహిస్తున్న శుభ్రతా కార్యక్రమాలను ఆయన అభినందించారు. అలాగే అమ్మ పేరుతో చెట్టు కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు పరిధిలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ అమ్మ పేరుతో కనీసం ఒక మొక్క నాటి, దానిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మహిళలకు ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సెర్ప్ రాష్ట్ర అధికారి భారతి అన్నారు. మండలకేంద్రంలోని మండల సమాఖ్య భవనంలో శుక్రవారం మహిళా సంఘాలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా సీనియర్ సీఆర్పీ శోభారాణి, నాగశ్రీ గ్రామ, మండల సమాఖ్యలో సంఘాల పుస్తక నిర్వహణ, ఆర్థిక అంశాలు, ఆదాయ అభివృద్ధి వ్యాపారాలపై మహిళా సంఘ సభ్యులకు వివరించారు. ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులు చేయాలన్న లక్ష్యంగా ఉందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి అదనపు డీఆర్‌డీవో విజయలక్ష్మి, గ్రామ సంఘాల అధ్యక్షులు, మండల సమాఖ్య అధ్యక్షులు, ఏపీఎం రాం నారాయణ్ గౌడ్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో నేర్చుకునే ఉత్సాహం పెంపొందించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** విద్యార్థుల్లో నేర్చుకునే ఉత్సాహం పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. శుక్రవారం మోస్రా జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి రిజిస్టర్లు పరిశీలించారు. పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యాస నైపుణ్యాల మెరుగుదల కోసం నిరంతర పర్యవేక్షణ చేయాలని, హాజరు, పనితీరు అంశాలపై క్రమం తప్పకుండా గమనించాలని ఆదేశించారు.




ఆర్మూర్ పట్టణంలోని స్మైల్స్ ద స్కూల్‌లో శుక్రవారం హాలో విన్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలో అలరించారు. పిల్లల్లో భయాన్ని తీసివేసేందుకు ఈ సెలబ్రేషన్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరెస్పాండెంట్, ప్రిన్సిపాల్ షబానా గౌహర్, డైరెక్టర్ రఫీ గౌహర్ తెలిపారు. **– అక్షరటుడే, ఆర్మూర్**

## తడిసిన ధాన్యం కొనుగోలు : భూపతిరెడ్డి



గన్నారంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్

**అక్షరటుడే, ఇందల్వాయి:** అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లిస్తూ ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని రూరల్ ఎమ్మెల్యేభూపతి రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరిస్తున్న తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందల్వాయి మండలం గన్నారం గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు. తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. తడిసిన ధాన్యం విషయమై ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని, ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు మేరకు తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తున్నామని రైతులకు భరోసా ఇచ్చారు. జిల్లాలో 10,500 మెట్రిక్ టన్నుల ధాన్యం అకాల వర్షానికి తడిసినట్టు అంచనా వేశామని ఎమ్మెల్యే భూపతి రెడ్డి తెలిపారు. రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, డీసీవో శ్రీనివాస్, సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సొసైటీ ఛైర్మన్ గోపి, తహశీల్దార్ వెంకట్ రావు, ఎంపీడీవో అనంత్ రావు ఉన్నారు. అనంతరం గన్నారం శివారులో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు.



## కమనీయం.. లక్ష్మీ నృసింహుని కల్యాణం..

భీమ్‌గల్ నింబాచల క్షేత్ర శ్రీ లక్ష్మీ నృసింహుని బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అనంతరం కలశ పూజ, విశ్వక్సేన పూజ నిర్వహించి స్వామివారికి రక్షా బంధనం చేశారు. పంచామృతాలతో అభిషేక పూజలు జరిపారు. అనంతరం స్వామివారి కల్యాణ తంతును ప్రధాన అర్చకులు ఘనంగా జరిపించారు. సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణ వేడుకలను తిలకించడానికి భారీగా భక్తులు తరలివచ్చారు.

– అక్షరటుడే, భీమ్‌గల్

## మిషన్ భగీరథ లీకేజీకి మరమ్మతులు




**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలోని తలాబ్ తండా హోటల్ గేట్ వద్ద మిషన్ భగీరథ నీళ్ల లీకేజీ శుక్రవారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. నీరు వృథాగా పోతోందని దీంతో గ్రామస్థులకు పూర్తిస్థాయిలో తాగునీరు అందట్లేదని పేర్కొంటూ ఈనెల 26న 'మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీలు' శీర్షికతో 'అక్షరటుడే'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు లీకేజీలకు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. అనంతరం మిషన్ భగీరథ అధికారులు మాట్లాడుతూ లీకేజీలను పూర్తిగా పరిష్కరించి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చేస్తామని పేర్కొన్నారు.

## కోటగిరిలో ఓపెన్ హౌస్



**అక్షరటుడే, కోటగిరి:** మండల కేంద్రంలో పోలీస్ అమరవీరుల దినోత్సవంలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓపెన్ హౌస్ నిర్వహించారు. జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల 9,10వ తరగతి విద్యార్థులకు ఎస్సై సునీల్ ఆధ్వర్యంలో పోలీసుల విధులు, పనితీరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తుదారులు వచ్చినప్పటి నుంచి, పిటిషన్ తీసుకొని ఎఫ్ఐఆర్ చేసి ఎఫ్ఐఆర్ కాపీ ఇచ్చి కోర్టులో ప్రొడ్యూస్ చేసి ఆన్‌లైన్‌లో ఎలా తయారుచేస్తారనే విషయం వరకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. 100 నెంబర్ కాల్ వస్తే పోలీసులు ఎలా రెస్పాండ్ అవుతారనే విషయాన్ని వివరించారు. పోలీసుల బందోబస్తు, గన్ ఫైరింగ్ ఎలా చేస్తారనే విషయాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ రావు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సాయిలు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్య తీసుకోవాలి



**అక్షర టుడే, ఆర్మూర్:** ప్రభుత్వ భూమిని ఆక్రమించిన రియల్ ఎస్టేట్ వ్యాపారి తీగల నర్సారెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణ పరిధిలోని పెర్కెట్‌లో సర్వే నంబర్ 202/3 ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారి నర్సారెడ్డి ఆక్రమించి, సదరు స్థలంలో 24 ఇండ్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వ్యక్తికి అనుమతి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులు, వాస్తవాలను పట్టించుకోకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు మద్దతుగా ఎలా ఉంటారన్నారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ ఆర్మూర్ డివిజన్ నాయకులు సూర్య శివాజీ, అబ్దుల్, బాలయ్య, ప్రజా సంఘాల నాయకులు ప్రిన్స్, వెంకటేష్, నరేందర్, పాషా బాయ్, హన్మంత్ రెడ్డి, రాహుల్, కాజా పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఖబరస్థాన్‌కు స్థలం ఇవ్వొద్దని వినతి



**అక్షరటుడే, కామారెడ్డి:** గ్రామానికి సమీపంలో ఉన్న స్థలాన్ని ఖబరస్థాన్‌కు ఇవ్వొద్దని కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామస్థులు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డిని కోరారు. ఈమేరకు శుక్రవారం సుమారు 50 మంది గ్రామస్థులు కలెక్టర్, ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. క్యాసంపల్లి గ్రామంలో ఖబరస్థాన్ కోసం 10 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించినట్టుగా తెలిసిందన్నారు. ఆ భూమిని వ్యవసాయ భూమిగా పరిగణించాలని కోరారు. గ్రామానికి కూతవేటు దూరంలోనే ఆ స్థలం ఉందని, గ్రామానికి సంబంధించిన తాగునీటి సరఫరా బోరు కూడా అక్కడే ఉన్నందున గ్రామ శివారులో ఖబరస్థాన్‌కు ఆ భూమిని కేటాయించవద్దని కోరారు. తక్షణమే కేటాయింపులకు సంబంధించిన అనుమతులు నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. ఒకరి మృతి

**అక్షరటుడే, ఆర్మూర్:** నందిపేట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. జోర్‌పూర్ వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు బైకును ఢీకొట్టింది. దీంతో యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. నందిపేట మండలంలోని ఖుద్వాన్‌పూర్‌కు చెందిన బేగరి పోశెట్టి(30), అతని తల్లి బేగర సునీత ఇద్దరు కలిపై ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో పోశెట్టి మృతి చెందాడు. అతని తల్లి సునీతకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిజామాబాద్ నగరంలో 2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్, సీపీ




కామారెడ్డిలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర






నిజామాబాద్ నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో..

## ఉత్సాహంగా 2కే రన్

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా..రాష్ట్రీయ ఏక్తా దివస్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా 2కే రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఆయా మండలాల్లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశ సమైక్యతకు పాటుపడి 530కి పైగా సంస్థానాలను విలీనం చేసిన ఉక్కుమనిషి పటేల్ అని వక్తలు కొనియాడారు. ఆయన స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలని సూచించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్




ఆర్మూర్ పట్టణంలో..



బోధన్ పట్టణంలో..



ఎల్లారెడ్డిలో..



గాంధారిలో..



ఇందల్వాయిలో..



కమ్మర్‌పల్లిలో..



ఎల్లారెడ్డి పట్టణంలో..




పోచంపాడ్‌లో..



పెద్దకొడప్‌గల్ మండలంలో..

## గ్రామసభలో జనాలేరి..!



**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** మండలంలోని చవని తండా గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉపాధిహామీ పనులపై ఆడిట్ సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. కాగా, సభకు గ్రామస్థులెవరూ హాజరు కాలేదు. సభలో డీఆర్‌పీ శ్రీకాంత్ 2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పని వివరాలను చదివి వినిపించారు. దీంతో కొన్ని లోపాలు వెలుగులోకి వచ్చాయి. ఉపాధిహామీ పథకంలో పనిచేసిన కూలీలకు 10 రోజులు పనిచేస్తే 12 రోజుల కూలీ చెల్లించారని అన్నారు. ప్రతివారం ఉపాధి పనుల వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయ నోటీస్‌బోర్డులో ప్రదర్శించాలని, కానీ అవేమీ లేవన్నారు. అలాగే మరొకరికి 12 రోజులు పని చేస్తే 10 రోజుల కూలీ మాత్రమే చెల్లించారని, దీంతో సదరు ఉపాధి కూలీ రెండు రోజుల కూలీ రూ.600 నష్టపోయారన్నారు. ఉపాధిహామీ కూలీల జాబ్ కార్డులు పూర్తిస్థాయిలో అప్‌డేట్ కాలేదని తేలింది. కమాన్ నర్సరీలో పని తేదీల్లో ఎంబీలో వివరాలు నమోదు చేయాలి. కానీ నమోదు చేయకున్నా పని చేసినట్లు తేలింది. 8-4-24 నుంచి 14-4-24 వరకు పని చేసినట్లు సంతకాలు చేసి మస్టర్‌లో మాత్రం అసలు సంతకాలు లేకుండానే డబ్బులు తీసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిబాబు, కారోబార్ పాల్గొన్నారు.

నిజామాబాద్ నగరంలో..



ఆర్మూర్ పట్టణంలో..





బోధన్ పట్టణంలో..

## జిల్లావ్యాప్తంగా స్కూల్ బస్సుల తనిఖీ

జిల్లావ్యాప్తంగా ఆర్టీఏ అధికారులు, పోలీసులు స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బస్సులకు శుక్రవారం జరిమానాలు విధించారు. నిజామాబాద్ నగరంలో పాటు బోధన్, ఆర్మూర్ పట్టణాల్లో బస్సులను పరిశీలించి నిబంధనలు పాటించని వాటికి ఫైన్లు వేశారు. బస్సుల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. – **అక్షరటుడే, నెట్‌వర్క్**

## అత్యాచార నిందితుడి అరెస్ట్

**అక్షరటుడే, కామారెడ్డి:** మహిళపై కిరాతకంగా అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం ఫరీద్ పేట గ్రామానికి చెందిన ఓ మహిళ పత్తి చేను వద్ద పనులు చేసుకుంటుండగా గ్రామ శివారులో ఉన్న మణికంఠ రైస్ మిల్లులో పని చేసే వ్యక్తి వెనక నుంచి వచ్చి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. అనంతరం పొదల్లోకి లాక్కెళ్లి అరవకుండా నోరు నొక్కి అత్యాచారానికి పాల్పడ్డాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. విచారణ చేపట్టిన పోలీసులు.. రైస్ మిల్లులో పని చేస్తున్న 40 మంది వివరాలపై ఆరా తీశారు. ఈ 40 మందిలో కొంతమంది కనిపించలేదు. కాగా.. విచారణలో అత్యాచారం చేసిన వ్యక్తి బీహార్‌కు చెందిన రాహుల్ కుమార్‌గా గుర్తించారు. అయితే అతని ఫ్యామిలీ పంజాబ్ షిఫ్ట్ అయినట్టు తెలుసుకున్నారు. అత్యాచారం అనంతరం నిందితుడు పరారీలో ఉన్నాడు. అతడి ఆచూకీ కోసం కామారెడ్డి రూరల్, ఎల్లారెడ్డి, సీసీఎస్ సీఐలు, మాచారెడ్డి, దేవునిపల్లి, గాంధారి ఎస్సైలతో ఏడు బృందాలను ఏర్పాటు చేసి ఈ బృందాలను బీహార్, పంజాబ్, మహారాష్ట్రకు పంపించారు. నిందితుడు రాహుల్ మహారాష్ట్రలోని గొండియా పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులకు గురువారం దొరికాడు. అక్కడ మేజిస్ట్రేట్ ముందు అతడిని హాజరు పరిచి



ఇక్కడకు తీసుకువచ్చారు.

### వలస కార్మికుల డేటా సేకరిస్తాం

మహిళపై అత్యాచారం ఘటన తర్వాత వలస కూలీల వివరాలపై రాష్ట్రస్థాయిలో చర్చ వచ్చిందని ఎస్పీ తెలిపారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వలస వచ్చి పని చేస్తున్న వారి పూర్తి వివరాలు సంబంధిత కాంట్రాక్టర్ వద్ద ఉంచాలన్నారు. మహిళపై అత్యాచారానికి పాల్పడిన రాహుల్‌ను శనివారం కోర్టులో హాజరు పరిస్తామని.. ఇంకా విచారణ కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు. రాహుల్ పై గతంలో ఎలాంటి కేసులు లేవన్నారు. అతని నుంచి ఒక గొలుసు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, కామారెడ్డి రూరల్ సీఐ రామన్, మాచారెడ్డి ఎస్సై అనిల్, గాంధారి ఎస్సై ఆంజనేయులు, సీసీఎస్ సీఐ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలోని పోచారం తండా గ్రామంలో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు పథకంలో భాగంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిషన్, ఎంపీడీఓ అభినవ్ చందర్, ఎంపీఓ లక్ష్మికాంత్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

